క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డీఎంహెచ్ఓ ధన్‌రాజ్



మందులను పరిశీలిస్తున్న ధన్‌రాజ్

బెజ్జంకి(సిద్దిపేట): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ సిబ్బందికి సూచించారు. బెజ్జంకి, తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్త పరీక్షలు నిర్వహించి అన్ని రకాల మందులు, వ్యాక్సిన్‌లను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమాలలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆనంద్, బాబ్జి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్ తనిఖీ



పరికరాలను పరిశీలిస్తున్న షాహిద్, రామకృష్ణ

నంగునూరు(సిద్దిపేట): అంబులెన్స్ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ క్వాలిటీ కంట్రోల్ ఉమ్మడి జిల్లాల ప్రోగ్రామింగ్ మేనేజర్ జాన్ షాహిద్ సూచించారు. మంగళవారం నంగునూరు 108 అంబులెన్స్‌ను తనఖీ చేసి మండలంలో ఇప్పటి వరకు నమోదైన కేసులు, అందించిన సేవలు, వైద్య పరికరాలు, రికార్డులు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ శ్రీహరి రామకృష్ణ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం మోదీతోనే సాధ్యం

బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): బీసీల సంక్షేమానికి పాటుపడేది ప్రధాని మోదీనేనని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బెజ్జంకిలో మంగళవారం నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర కేబినెట్‌లో 27 శాతం బీసీ మంత్రులున్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు కై వసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆపార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజు, అజయ్‌వర్మ, వెంకట్‌రెడ్డి, బాస్కర్, మల్లేశం, వేణు, రవి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో చెత్త వేయొద్దు



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసవర్మ

కొమురవెల్లి(సిద్దిపేట): డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం వేయవద్దని ఎంపీడీఓ శ్రీనివాస వర్మ హెచ్చరించారు. మంగళవారం కొమురవెల్లి ఆలయ పరిసరాలలో డ్రైనేజీని పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌తో కలసి పరిశీలించారు. సిబ్బంది జెట్‌మెషన్‌తో డ్రైనేజీని శుభ్రపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాలలో ప్రైవేట్ వసతి గదుల నిర్వాహకులు ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, షాంపూ కవర్లు లాంటివి డ్రైనేజీలో కాకుండా చెత్త డబ్బాలలో చేయాలన్నారు. డ్రైనేజీలో వేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రక్త నమూనా పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

గజ్వేల్‌రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థినులు భాగస్వాములు కావాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం అన్నారు. కళాశాలలో విద్యార్థినులకు మంగళవారం రక్త నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, పౌష్టికరమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు శైలజ, సుజాత, స్రవంతి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పరమేశ్వరచారి, మల్లేశంగౌడ్, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన పాల్గొన్నారు.

వర్షాకాలం జరపైలం

భయపెడుతున్న విష సర్పాలు

- బలవుతున్న అన్నదాతలు
- జాగ్రత్తలు తీసుకోవాలి: వైద్యులు

దుబ్బాకరూరల్: వర్షాలు కురువడంతో బీడు పడిన భూముల్లో పచ్చగా గడ్డి మొలుస్తుంది. చెట్లు, చేమ చిగురిస్తుంది. దీంతో క్రిమి కీటకాలు, విష సర్పాలు, తేళ్లు విచ్చిల విడిగా సంచరిస్తుంటాయి. దారితప్పి పొలాల వద్ద, ఇళ్లలోకి చేరుతుంటాయి. ఈ క్రమంలో ముఖ్యంగా రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

పొంచిఉన్న ప్రమాదం

పొలం గట్ల పైన గడ్డి ఎక్కువగా మొలవడంతో పాములు, తేళ్లు ఉండే అవకాశం ఉంది. పొలాలల్లో పాములు తిరుగుతుంటాయి. రైతులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడేఅవకాశం ఉంది. రైతులు ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలి. పొలం గట్లపై గడ్డి మందును పిచికారీ చేయాలి.

రాత్రి వేళలో టార్చ్ లైట్ వాడాలి

రైతులు రాత్రి వేళలో పొలాలకు వెళ్లే సమయంలో టార్చ్‌లైట్‌ను తప్పని సరిగా తీసుకెళ్ళాలి. షూస్ వేసుకోవాలి. విద్యుత్ స్టార్టర్ డబ్బాల వద్ద అప్రమత్తంగా ఉండాలి. స్టార్టర్ డబ్బాలో పాములు, తేళ్లు చేరే అవకాశం ఉంది. రైతులు పొలాలల్లోకి వెళ్లెటప్పుడు తప్పని సరిగా చేతిలో కర్రను తీసుకెళ్లాలి. ఇటీవల దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌లో ఓరైతు పొలం గట్టుపై గడ్డి కోస్తుండగా పాముకాటు వేసింది. దీంతో ఆ రైతు మృతి చెందాడు. అతని కుటుంబం రోడ్డున పడింది.



స్టార్టర్ డబ్బాలో పాము

శుభ్రంగా ఉంచుకోవాలి

ఇంటి ఆవరణలో ఎలాంటి గడ్డి, పిచ్చి మొక్కలు మొలవకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వర్షాకాలం పాములు, తేళ్లు ఇళ్లలోకి చేరే అవకాశం ఉంది.

వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలి



పాము కాటు వేసిన వెంటనే అధైర్య పడొద్దు. ఆ వ్యక్తిని వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. అది విషపూరితమా? కాదా? అనేది రక్త పరీక్షల ద్వారా నిర్ధారణ అవుతుంది. దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో 'యాంటిస్నేక్ వీనం' మందు అందుబాటులో ఉంది. తేళ్లకాటుకు కూడా మందులు ఉన్నాయి. వర్షాకాలంలో రైతులు ప్రత్యేక జాగ్రత్తగా పాటించాలి.

-హేమరాజ్ సింగ్, ప్రభుత్వ వైద్యుడు, దుబ్బాక

విద్యుత్ తీగలతో అప్రమత్తం

కొంత మంది రైతులు తమ పొలాల్లో బోర్ బావుల వద్ద స్టార్టర్ డబ్బాలను పొలం గట్లపై పెడతారు. స్టార్టర్ డబ్బా నుంచి విద్యుత్ సర్వీస్ వైరు గట్ల మీదుగా ఉంటాయి. దీంతో రైతులు పొలం గట్టుపై గడ్డి కోసే సమయంలో కొడవలి విద్యుత్ తీగకు తగిలి మరణించిన ఘటనలు చాలానే ఉన్నాయి. విద్యుత్ తీగలను సిమెంట్ స్తంభానికి ఏర్పాటు చేసుకోవాలి.

మోతాదుకు మించి వాడితే నష్టం

- నానో యూరియా, డీఏపీ వినియోగించాలి
- శాస్త్రవేత్తలు, అధికారులు

తొగుట(దుబ్బాక)/వర్గల్(గజ్వేల్)/దుబ్బాకరూరల్: మోతాదుకు మించి ఎరువులు వాడితే భూసారం దెబ్బతింటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. తొగుట మండలంలోని గుడికందుల రైతు వేదికలో తెలంగాణ రైతు విజ్ఞానకేంద్రం, తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవాం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి మాట్లాడుతూ మోతాదు మేరకే ఎరువులు వాడితే ఖర్చు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. మరో శాస్త్రవేత్త సంతోష్ కుమార్ మాట్లాడుతూ మోతాదుకు మించి ఎరువులు వేసినా మొక్కకు సరిపడా తీసుకుని మిగతా ఎరువు వృథాగా పోతుందన్నారు. శాస్త్రవేత్త రమాదేవి యాజమాన్య పద్ధతులపైనా, కోరమండల్ సంస్థ జోనల్ మేనేజర్ ప్రసాద్ నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ రైతు బీరయ్య సాగుచేసిన పత్తి పంటకు నానో డీఏపీ డ్రోన్ ద్వారా పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ మోహన్, ఏఈఓలు దేవేందర్, నవ్య, బుస్సాపూర్, గుడికందుల, ఘనపురం గ్రామాల రైతులు, సిరిసిల్ల బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.వర్గల్ మండలం తున్కిఖాల్సా రైతు వేదికలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాజమాన్య పద్ధతులు, నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి మోతాదు గుర్తించేందుకు ఉపయోగపడే పైపులను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ అనిల్‌కుమార్ మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీల వాడకంతో 8 శాతం దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు భీమ్ సాగర్, నవీన్ కుమార్, ఏఓ శేషశయన, ఏఈఓలు అనిత, మానస, భారతి తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకరూరల్ మండలంలోని చీకోడ్, చెల్లాపూర్ గ్రామాల రైతులకు మండల వ్యవసాయశాఖ, ఇప్కో ఆధ్వర్యంలో నానో యూరియాపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అర లీటర్ నానో యూరియా చల్లితే ఎకరానికి సరిపోతుందన్నారు. ఇప్కో ప్రతినిధి పృథ్వీరాజ్, ఏఈఓలు సంతోష్, కవిత తదితరులు పాల్గొన్నారు.



తొగుట(దుబ్బాక): పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

రోడ్ల నిర్మాణాలకు నిధులు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గంలో వంద కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణాలపై పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. అనంతరం విలేకరులకు వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలోని 81 కిలోమీటర్ల పీఆర్ రోడ్లు, 22 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్లకు ప్రభుత్వం హ్యామ్ పథకం క్రింద నిధులు మంజూరు చేసిందని చెప్పారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణంతో భారీ వాహనాలు తిరగడంతో నియోజకవర్గంలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయన్నారు. రోడ్ల రెన్యువల్ కొత్త రోడ్ల ఏర్పాటు పనులు పారదర్శకంగా జరిగేటట్లు చూడాలని అధికారులకు సూచించామని, నిధులు మంజూరు గురించి పీఆర్ ఈఎన్‌సీ అశోక్‌తో మాట్లాడామని ఎమ్మెల్యే తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా నాగుల పంచమి

శ్రావణ మాసం నాగుల పంచమి సందర్భంగా మంగళవారం పలు దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి నాగదోషం తొలగిపోవాలని వేడుకున్నారు. అదే విధంగా శివాలయాల్లోను ప్రత్యేక పూజలు చేశారు.



గజ్వేల్‌రూరల్: అహ్మదీపూర్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున మహిళలు



కొమురవెల్లిలో పుట్ట వద్ద పూజలు



నంగునూరులో నాగమానసాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో మహిళల పూజలు

దుబ్బాక ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

4.3 కిలోల ఒవేరియన్ గడ్డ తొలగింపు

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. సూపరింటెండెంట్, ప్రముఖ సర్జన్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో వైద్య బృందం మంగళవారం ఓ మహిళ కడుపులో ఉన్న 4.3 ఒవేరియన్ మాస్‌గడ్డ తొలగించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతపల్లికి చెందిన మంజుల తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ చాలా చోట్ల వైద్య పరీక్షలు చేయించుకుంది. అయినా ఫలితం లేకపోవడంతో దుబ్బాక ఆస్పత్రిలో సంప్రదించింది. దీంతో ఆమెకు అత్యవసరంగా ఆపరేషన్ నిర్వహించాలని వైద్యులు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేసి ఆమె కడుపులో ఉన్న 4.3 కిలోల గడ్డను విజయవతంగా తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని హేమరాజ్‌సింగ్ తెలిపారు.



శస్త్రచికిత్స చేసిన హేమరాజ్‌సింగ్, వైద్యులు

పైపులైను వేశారు.. న్యాయం చేయండి

మంత్రికి మాజీ ఎమ్మెల్సీ వినతి

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలోని రాజగోపాల్‌పేట శివార్లలో తన కుమార్తె ఫరీదా భానుకు చెందిన సర్వే నంబర్ 410లోని వ్యవసాయ భూమిలో నీటిపారుదలశాఖ అధికారులు సమాచారం లేకుండా పైప్‌లైను వేశారని వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మంగళవారం రాష్ట్ర మంత్రి వివేక్‌కు ఫిర్యాదు చేశారు. కొండ మల్లయ్య గార్డెన్స్‌లో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఫారూఖ్ వేదిక మీదకు వచ్చి మంత్రిని కలిసి సమస్య గురించి వివరించి వెళ్లిపోయారు. అంతకుముందు ఇంగ్లాండ్‌లో నివసిస్తున్న ఫారూఖ్ కూతురు ఫారీదా భాను కలెక్టర్‌కు పిర్యాదు చేసినట్లు సమాచారం.



మంత్రి వివేక్‌కు ఫిర్యాదు చేస్తున్న ఫారూఖ్

నైపుణ్యంతోనే ఉన్నత స్థానాలు పొందొచ్చు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమ నైపుణ్యాలను చాటినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు సూచించారు. కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన సీఐఎస్‌సీవో-మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో మంగళవారం సాఫ్ట్‌స్కిల్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కవిత, వెంకటేశ్వర్లు, వెంకటేష్, విజయభాస్కర్‌రెడ్డి, జబ్బర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య సినారె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు

గౌరవెల్లిని హుస్నాబాద్‌లో విలీనం చేయండి

అఖిల పక్ష నాయకుల డిమాండ్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో కొనసాగుతున్న గౌరవెల్లి గ్రామాన్ని హుస్నాబాద్‌లో విలీనం చేయాలని అఖిల పక్ష నాయకులు గొల్లపల్లి వీరాచారి, మంద పరశు రాములుగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని గౌరవెల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల విలీనం అంశంపై గెజిట్ విడుదలైందన్నారు. ఈ గెజిట్‌ను కాదని, గౌరవెల్లిని అక్కన్నపేటలోనే కొనసాగించాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఈ విషయంపై విన్నవిస్తామని చెప్పారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ నాయకులకు అనుకూలంగా ఉండేలా గ్రామాలను విలీనం చేస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. గౌరవెల్లిని విలీనం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రవీణ్, రామస్వామి, రాము, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వీరాచారి తదితరులు

ఎరువుల కొరతతో రైతుల ఇబ్బందులు

సీపీఎం నేత శివరాజ్

హుస్నాబాద్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ యూరియా, డీఏపీ ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సరిపడా ఎరువులు సరఫరా చేయాలని సీపీఎం నియోజకవర్గ నాయకుడు శివరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సినన్ని ఎరువులను సరఫరా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. బస్తా యూరియాకు రూ.2 వేలు, డీఏపీకి రూ.1,700 ఇచ్చే సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. తక్షణమే రైతులకు సరిపడా ఎరువులను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, లోకేశ్‌రాయుడు, భిక్షపతి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

యూరియా బ్లాక్ చేస్తే కేసులు తప్పవు

హుస్నాబాద్: యూరియా బ్లాక్ మార్కెట్ చేస్తే సంబంధిత డీలర్‌పై కేసు నమోదుచేసి లైసెన్స్ రద్దు చేస్తామని ఏడీఏ మల్లయ్య హెచ్చరించారు. పట్టణంలోని రైతువేదికలో మంగళవారం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎరువులు, విత్తనాలను ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలర్ వద్ద నానో యూరియా స్టాక్ అందుబాటులో ఉంచాలన్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో సరిపడా యూరియా ఉందని తెలిపారు. సమావేశంలో ఏఓలు పూజ, సతీశ్, తస్లీమా, ఏఈఓలు మహిపాల్, స్వామి, నిబిహ పాల్గొన్నారు.

గజ్వేల్ ప్రాంతంలో తగినంత యూరియా

మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్ ప్రాంతంలో యూరియా కొరత లేదని, బీఆర్‌ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకుసాగుతున్నారని, ప్రభుత్వంపై బురదచల్లడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ నేతలు పనిచేస్తున్నారని మండిపడ్డారు. యూరియా పంపిణీ సక్రమంగా సాగుతోందని, రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో ఏడీఏ బాబునాయక్, సహకార సంఘం చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ, వ్యవసాయాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ పరామర్శ

దౌల్తాబాద్(దుబ్బాక): ఇటీవల మరణించిన మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింహులు కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య మంగళవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నర్సింహులు పార్టీలకతీతంగా అందరితో కలివిడిగా ఉండేవాడని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఆది వేణు, రమేశ్ తదితరులు ఉన్నారు.

● కందిమల్లయ్యపల్లి పీఠాధిపతికి సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): కందిమల్లయ్యపల్లి పీఠాధిపతి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారసుడు వెంకటాద్రికి స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు మంగళవారం పాదపూజచేసి ఘనంగా సన్మానించారు. అనంతరం కల్లెపెల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

● దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: రాఘవాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతిలో సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి హేమలత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని, 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆగస్టు 1న జరుగనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, యూటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

● సదుపాయాలు సమకూర్చాలని వినతి

సిద్దిపేటరూరల్: మండలంలో కనీస సదుపాయాలు సమకూర్చాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్ మంగళవారం వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన గురుకుల పాఠశాలను నిర్మించాలని, పోలీస్‌స్టేషన్, జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వామి, బాపురెడ్డి, అక్షయ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

● డిజిటల్, కామర్స్ ల్యాబ్‌ల ప్రారంభం

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిజిటల్ తరగతులు, కామర్స్ ల్యాబ్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ భిక్షపతి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ సౌకర్యాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో చంద్రమౌళి,బాలరాజు, అనిల్ కుమార్, ఇందిరా నాయనదేవి తదితరులు పాల్గొన్నారు.

● 31న తక్షణ ప్రవేశాలు

మిరుదొడ్డి(దుబ్బాక)/ములుగు(గజ్వేల్)/చేర్యాల(సిద్దిపేట)/దుబ్బాకరూరల్/హుస్నాబాద్‌రూరల్/తొగుట(దుబ్బాక)/సిద్దిపేటరూరల్/హుస్నాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో తక్షణ ప్రవేశాలు చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రిన్సిపాల్స్ మంగళవారం ప్రకటనల్లో పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు 31న ఉదయం 9 గంటలకు నిర్వహించే తక్షణ ప్రవేశాలకు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. అదే రోజు సాయంత్రం అర్హుల జాబితాను వెల్లడిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అపరిచితులతో అప్రమత్తం

సీఐ రవికుమార్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సీఐ రవికుమార్ సూచించారు. మైనార్టీ బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షీటీమ్ విధులు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, చెడు వ్యసనాల బారిన పడవద్దన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సైబర్ నేరాలు, పోక్సో, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఏ సమస్య ఉన్నా విద్యార్థులు 100, షీ టీమ్ (8712667434), స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ (9494639498)ను తెలియజేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సంధార్యాణి, అధ్యాపకులు, ఏఎస్ఐ ఉమర్, షీ టీమ్ సిబ్బంది మహేందర్‌రెడ్డి, మహేశ్, దివ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.